సభ్య సమాజం తలదించుకొనే విధంగా దేశ రాజధాని ఢిల్లీ నడి వీధిలో ఒక నిస్సహాయ యువతిపై అత్యంత పైశాచికంగా సామూహిక అత్యాచారం జరిగింది. యావత్ దేశాన్ని రగిలించిన ఆ సంఘటన అనేకుల హృదయాలను కలిచి వేసింది... కొందరు మనుషులలో గూడు కట్టుకుపోయిన రాక్షసత్వం సమాజాన్ని వణికిస్తుంది...దైవ భయం మనిషిలో కొరవడిన కారణాన జరుగుతున్న ఈ అరాచకాలకు ముగింపు ఎప్పుడు?



# నిర్భయ చట్టం

డా. జాన్ వెస్లీ

2012 డిశంబర్ 16న బస్సులో ప్రయాణిస్తున్న 23సంవత్సరాల మెడికల్ విద్యార్థిని అతితీవ్రంగా గాయపరచబడి చెరిచి వేయబడి క్రిందకు త్రోసివేయబడింది. దయచేసి నన్ను విడచిపెట్టండి అని ఎంత బతిమాలుకొన్నా ఆ కామాంధులకు జాలి కలుగలేదు. విచక్షణా రహితంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. అతి తీవ్రంగా గాయపడిన యువతి 13 రోజులు నరకాన్ని అనుభవించి సింగపూర్ హాస్పటల్‌లో డిశంబరు 29న తుది శ్వాస విడించింది. అంతకుముందు ఆమెను బ్రతికించడానికి ఢిల్లీ వైద్యులు విశ్వ ప్రయత్నాలు చేశారు. జాతి, కుల, మతాలకు అతీతంగా యువకులు రోడ్లమీదకు వచ్చి ఆ పైశాచిక చర్యను ఖండిచారు. మృగాలుగా మారిన యువకులకు కఠిన శిక్షలు అమలు చేయాలని గొంతెత్తి నినదించారు. నడిరోడ్ల మీద ఉరి తీయాలని ముక్త కంఠంతో గర్జించారు. ఈ విషయం అంతర్జాతీయంగా అనేక వార్తా పత్రికల్లో ప్రచురించబడింది.

మహిళలపై అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్న దాడులు మానభంగాలు, అత్యాచారాలపై నేటి యువత ఒత్తిడితో ప్రభుత్వాలు కూడా కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. మహిళలపై, బాలికలపై అత్యాచారాలను అరికట్టేందుకు, మృగాళ్లను అత్యంత కఠినంగా శిక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం **"నిర్భయ చట్టాన్ని"** అమలులోకి తెచ్చింది. జస్టిస్. జె.ఎస్. వర్మ నేతృత్వంలో జ్యూడిషియల్ కమిటీ సిఫారసుల ఆధారంగా క్రిమినల్ లా ఆర్డినెన్స్ - 2013 ను పార్లమెంటు ఆమోదించడం ద్వారా చట్టంగా రూపు దిద్దబడింది. ఇకపై బాధితురాలి మరణానికి లేదా పూర్తి శారీరక వైకల్యానికి గురిచేసే అత్యాచారాలకు పాల్పడిన కేసుల్లో వ్యక్తులకు మరణ దండన విధించబడుతుంది.

జ్యోతి సింగ్ పాండే అనే అమ్మాయి విషయంలో నిందితులైన ఆరుగురిలో ఒకడు మైనర్ బాలుడు కాగా మరొకడు పోలీస్ కస్టడీలోనే ఉరి వేసుకొని చనిపోయాడు. మిగతా వారికి మరణ దండన విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పునిచ్చింది.

అయితే ఇంత కఠినమైన చట్టాలు, శిక్షలు అమలులోనికి వచ్చినా మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు తగ్గుముఖం పట్టలేదు. ప్రతి రోజూ దేశవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు అడ్డూ ఆపూ లేకుండా జరిగిపోతూనే ఉన్నాయి. అభం శుభం తెలియని బాలికలపై జరుగుతున్న అత్యాచార ఉందంతాలు హృదయాలను పిండేస్తున్నాయి. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు కూడా ఇలాంటి లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటూ కటకటాల్లోనికి నెట్టివేయబడ్డారు. ఆంధ్రప్రదేశ్ లోని తెనాలిలో త్రాగిన మైకంలో ఒక యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించి ఆమె తల్లి మరణానికి కారణం అయిన యువకులపై మొట్టమొదటి నిర్భయ కేసు నమోదైంది. ఇది ఎంత విచారమో కదా! కేవలం చట్టాలు చేసి నిందితులకు కఠిన శిక్షలు విధించడం సరిపోదని... సమాజంలో మార్పు రావాలని... ఒక వ్యక్తి యొక్క ఆలోచన ధోరణిలో మార్పు రావాలని సామాజిక మానసిక వేత్తలు సూచిస్తున్నారు.

నిజమే! మార్పు అనేది మనిషి హృదయంలో రావాలి నేటి యువత సన్మార్గంలో నడవాలి సాటి మనిషిని మనిషిగా గుర్తించి, గౌరవించే సమాజం అందరికి కావాలి. మానవ హృదయం పరివర్తన చెందనందువలనే మానవుడు మృగంలా ప్రవర్తించి సభ్య సమాజానికి కీడుకరంగా తయారవుతున్నాడు.

పాడైపోయిన మానవ హృదయాన్ని మార్చడం ఎవరికి సాధ్యం? **ఖచ్చితంగా మానవుని నిర్మించిన దేవునికే సాధ్యము.** ఆ దేవునికి మనిషి తన హృదయంలో చోటిచ్చినప్పుడు చీకటి తొలగి అతని జీవితం వెలుగుమయమౌతుంది.

దేవుని వాక్యము రెండంచుల ఎటువంటి ఖడ్గము కంటెను వాడిగా నుండి ప్రాణాత్మలను మూలుగులను విభజించునంత వరకు దూరుచు మనుష్యుని యొక్క హృదయాంతరంగములను పరిశోధిస్తుంది. దేవుని మాటకు ఒక వ్యక్తి లోబడినపుడే ఆ వ్యక్తి నూతన సృష్టిగా మార్చబడగలడు.

సర్వలోక మానవుల హృదయాలలో మార్పును తీసుకొని వచ్చి ప్రతీ ఒక్కరిని ఆధ్యాత్మికంగా వెలిగించాలనే యేసుక్రీస్తు ప్రభువు ఈ లోకానికి వచ్చారు. ఆయన జన్మ, బోధనలు, మరణం, పునరుత్థానం అన్ని ప్రత్యేకములే. ఆయన జన్మలో పాపము లేదు...మాటల్లో, ప్రవర్తనలో కపటము లేదు...సిలువలో మరణిస్తున్న సమయంలో కూడా తనను హింసించుచున్న వారికై ప్రతీకారాన్ని కోరక క్షమాపణ కోరెను. ప్రేమామయుడైన దేవుడు మనమింకను పాపులమై యుండగానే మన పాపముల నిమిత్తం చనిపోయెను. పాపముతో బంధించబడిన మానవుని విడుదల చేసి శాంతి, సంతోషము, సమాధానములను అనుగ్రహించి ఆయన శరణుజొచ్చిన వారికి నూతన జీవితం ప్రసాదించిన ప్రేమామయుడు యేసుక్రీస్తు.

**యేసుక్రీస్తు ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించిన వారెందరో ఈ అద్భుత మార్పును అనుభవించారు. ఊహించలేని మార్పును వారి జీవితాలలో అనుభవిస్తూ అనేకులకు సంతోషాన్ని పంచుతూ సమాజానికి ఆశీర్వాదకరంగా జీవిస్తున్నారు. వ్యసనాల్లో నిర్వీర్యపోయిన వారు విడుదల పొంది చక్కని జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వేదన, బాధల్లో చిక్కుకున్న వారు పరిష్కారాన్ని కనుగొన్నారు.**

ఈ మాటలు చదువుతున్న చదువరీ! యేసుక్రీస్తు నీ మతాన్ని మార్చడానికి మత స్థాపకుడు కాదు.. నీ కులాన్ని , నీ పై రూపాన్ని మార్చడానికి ఈ లోకానికి రాలేదు. పాడైపోయిన నీ హృదయాన్ని మార్చడానికి వచ్చారు. పరిశుద్ధ గ్రంథం ఈలాగు సెలవిస్తుంది. **"పాపులను రక్షించుటకు, యేసుక్రీస్తు ఈలోకమునకు వచ్చెను" (1తిమోతి 1:15).** నీవున్న చోటనే ఆయన నీ రక్షకుడని గుర్తిస్తే నీ జీవితం ధన్యమౌతుంది, పావనమౌతుంది. తద్వారా ప్రతీ ఒక్కరూ "హృదయ మార్పును" పొందితే సమాజం బాగుపడుతుంది. ప్రతీ ఒక్కరు శుభప్రదమైన జీవితాన్ని జీవించగలరు. ఆమేన్.

---

ఆసక్తి కలిగిన వారు ఈ వ్యాసాన్ని కరపత్రికలుగా ముద్రించి మీ ప్రాంతాల్లో అనేకులకు పంచండి. యంగ్ హోలీ టీమ్ చేపట్టిన సువార్త ఉద్యమంలో పాలిభాగస్థులుకండి.